ఆదివారం

21-7-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 400 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com



నీట్‌లో అప్పుడెమో 720కి 720 మార్కులు

మిగతా 2లో



భారత్‌లో 11లక్షల కొవిడ్ అధిక మరణాలు

మిగతా 3లో



ఆధార్ కార్డు ఉంటే పది నిమిషాల్లో పాన్..

మిగతా 4లో



వర్షాలతో మీ కార్లు జాగ్రత్త

మిగతా 5లో

## నాయకత్వానికి ఎన్టీఆర్ ఒక బ్రాండ్

### రాజకీయంగా ఎంతోమందికి అవకాశాలు ఇచ్చారు

- కమ్మ అంటేనే కష్టపడే గుణం ఉన్నవారు
- కమ్మ గ్లోబల్ సమ్మిట్‌లో సీఎం రేవంత్ రెడ్డి



ముందడుగు హైదరాబాద్:
ఎన్టీఆర్ లైబ్రరీలో మేం చదువుకున్న చదువు మమ్మల్ని ఉన్నతస్థానంలో నిలబెట్టిందని, నాయకత్వానికి ఎన్టీఆర్ ఒక బ్రాండ్ క్రియేట్ చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఎన్టీఆర్ రాజకీయంగా ఎంతోమందికి అవకాశాలు ఇచ్చారని గుర్తు చేశారు. దేశంలో ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంకీర్ణ రాజకీయాల వల్లే ఇవాళ చాలా మందికి రాజకీయ అవకాశాలు వచ్చాయన్నారు. కమ్మ అంటేనే కష్టపడే గుణం ఉన్నవారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ లో జరిగిన కమ్మ గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. కమ్మ అంటే అమ్మలాంటి ఆప్యాయత కలిగినవారని ప్రశంసించారు. కమ్మవారు నేలను నమ్ముకుని కష్టపడి పనిచేస్తారని పేర్కొన్నారు. ఎక్కడ సారవంతమైన నేల ఉంటే అక్కడ కమ్మవారు కనిపిస్తారని వివరించారు. కష్టపడటం, పదిమందికి సాయం చేయడం మిగతా 2లో



## భయపెట్టి కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారు

- రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్నారు
- విద్యార్థులపై దాడులు, కేసులు పెడుతున్నారు
- రేవంత్ రెడ్డిపై గవర్నర్‌కు బిఆర్ఎస్ ఫిర్యాదు

ముందడుగు హైదరాబాద్:
బీఆర్ఎస్ పార్టీ నుంచి 10 మంది ఎమ్మెల్యేలను, 8 మంది ఎమ్మెల్సీలను భయపెట్టి కాంగ్రెస్‌లోకి చేర్చుకుంటున్న విషయం గురించి గవర్నర్‌కు తెలిపినట్లు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ చెప్పారు. దీనిపై న్యాయపోరాటం చేస్తున్నామని, ఈ విషయంపై స్పీకర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు గుర్తుచేశారు. ప్రొటోకాల్ ఉల్లంఘనలకు కూడా గవర్నర్‌కు వివరించినట్లు కేటీఆర్ తెలిపారు. నిరుద్యోగుల సమస్యలు, ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మిగతా 2లో



## కదులుతున్న కారులో బాలికపై అత్యాచారం

- వీడియో రికార్డు చేసిన మరో వ్యక్తి
- మాట వినలేదని సోషల్ మీడియాలో క్లిప్ వైరల్
- దారుణానికి పాల్పడ్డ ముగ్గురు యువకులు

వివరాలు 2లో

## హామీలన్నీ విస్మరించిన కాంగ్రెస్

- నిరుద్యోగ భృతి అంటూ మోసం చేసింది
- జాబ్ క్యాలెండర్ విషయమే మరిచిపోయింది
- నిరుద్యోగ మహాధర్నాలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



ముందడుగు హైదరాబాద్:
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ విస్మరించిందని, నిరుద్యోగ భృతి ఇస్తామని కాంగ్రెస్ మోసం చేసిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌లో బిజెపి యువ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన నిరుద్యోగ మహా ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. రేవంత్‌రెడ్డి మిగతా 2లో

ముందడుగు
ఆదివారం, 21-7-2024, హైదరాబాద్

# నాయకత్వానికి ఎన్టీఆర్ ఒక బ్రాండ్

(మొదటిపేజీ తరువాయి)

కమ్మవారి లక్షణమన్నారు. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా మార్చేందుకు కమ్మవారి భాగస్వామ్యం అవసరమన్నారు. నైపుణ్యాలను ప్రోత్సహించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తమకు భేషజాలు లేవని తాము లాన్ని అభిమానిస్తాం, ఇతర కులాలను గౌరవిస్తామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో ఎవరిపై వివక్ష ఉండదని రేవంత్ స్పష్టం చేశారు. అది తమ ప్రభుత్వ విధానం కాదన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం తమ హక్కుగా పేర్కొన్నారు. నిరసన తెలపకుండా నియంత్రించాలనుకుంటే ఫలితాలు ఎలా ఉంటాయో చూశాగా అని గుర్తు చేశారు. జాతీయ స్థాయిలో తెలుగువారు లేని లోటు కనిపిస్తోందన్నారు. కుల, మతాలకు అతీతంగా జాతీయ స్థాయిలో రాణించే తెలుగువారిని ప్రోత్సహించాలని రేవంత్ తెలిపారు. వివాదంలో ఉన్న 5 ఎకరాల కమ్మ సంఘం భూ సమస్యను పరిష్కరిస్తామన్నారు. భూ సమస్యను పరిష్కరించడంతో పాటు సంఘం భవన నిర్మాణానికి నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం ప్రకటించారు. పదిమందికి సాయం చేసే మీ సహజ గుణాన్ని వీడొద్దని కోరారు.

# భయపెట్టి కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారు

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్సీలతో కలిసి గవర్నర్ రాధాకృష్ణన్‌కు కేటీఆర్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో రాజ్యాంగంపై జరుగుతున్న దాడి, ఇతర అంశాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అక్రమంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకుంటున్నారు. ఎమ్మెల్యేలను చేర్చుకోవడంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశాం. ఫిరాయింపుపై న్యాయ ప్రక్రియ నడుస్తోందని గవర్నర్‌కు తెలిపామని.. సమస్యలపై గవర్నర్ వెంటనే స్పందించారని కేటీఆర్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులపై కక్ష కట్టిందని కేటీఆర్ విమర్శించారు. అప్రజాస్వామికంగా విద్యార్థులపై దాడులు, కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఉద్యమ సమయంలో ఉన్న పరిస్థితులే ఇప్పుడు ఉన్నాయని వ్యాఖ్యానించారు. హామీలను ప్రభుత్వం అమలు చేయట్లేదని గవర్నర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రంథాలయాల్లో చదువుతున్న విద్యార్థుల పట్ల దౌర్జన్యంగా వ్యవహరించారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# హామీలన్నీ విస్మరించిన కాంగ్రెస్

(మొదటిపేజీ తరువాయి)

జాబ్ క్యాలెండర్ విషయమే మరిచిపోయారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేకతను కూడగట్టుకుంటోందని.. ఆ పార్టీకి ప్రజలందరూ స్వస్తి చెబుతారన్నారు.

కాంగ్రెస్ నాయకులు ఎవరికి దొరికినంత వారు దోచుకుంటున్నారు. రాష్ట్రంలో విస్తారంగా అవినీతి కొనసాగుతోంది. అధికారాన్ని దుర్వినియోగం చేయడంలో మాత్రమే రాష్ట్రంలో మార్పు వచ్చింది. హామీలన్నీ వంద రోజుల్లో ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలి. గతంలో ప్రజల తీర్పును కాలరాసి కేసీఆర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బిఆర్ఎస్‌లో చేర్చుకున్నారు. రాష్ట్రంలో కేవలం జెండా మాత్రమే మారింది. ప్రజావాణి వినిపించడంలో బిజెపి కృషి చేస్తుంది. గ్రూప్ 1 మెయిన్స్‌కు 1:50 కాకుండా 1:100 నిష్పత్తిలో ఎంపిక



చేయాలి. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు గ్రూప్ 2లో 783 పోస్టులను 2000కు పెంచాలి. 1365 గ్రూప్ 3 పోస్టులను 3000కు పెంచాలి. హామీ ఇచ్చినట్లుగా 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వెంటనే చేపట్టాలి. మెగా డీఎస్సీలో భాగంగా 25 వేల ఉద్యోగాలను భర్తీ చేయాలి. నిరుద్యోగులకు వెంటనే రూ.4 వేల భృతిని విడుదల చేయాలి" అని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# కదులుతున్న కారులో బాలికపై అత్యాచారం

ముందడుగు మధ్యప్రదేశ్:
ముగ్గురు యువకులు బాలికను కిడ్నాప్ చేసి, కదులుతున్న కారులో ఒక వ్యక్తి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. మరో వ్యక్తి వీడియో రికార్డ్ చేశాడు. ఆ బాలికను బ్లాక్‌మెయిల్ చేయసాగారు. వారి మాట వినకపోడంతో ఆ వీడియో క్లిప్‌ను సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఈ నేపథ్యంలో బాధిత బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 13 ఏళ్ల బాలిక 9వ తరగతి చదువుతోంది. ఏడాది కిందట చినూర్‌కు చెందిన ఒక యువకుడితో ఆమెకు స్నేహం ఏర్పడింది. అతడు తన ఇద్దరు స్నేహితులను ఆమెకు పరిచయం చేశాడు. దీంతో వారు సోషల్ మీడియాలో చాట్ చేసుకున్నారు.

జూన్ 1న బాలిక స్నేహితుడు తన ఫ్రెండ్స్‌తో కలిసి కారులో వచ్చారు. ఆమెను పిలిపించి కారులోకి బలవంతంగా ఎక్కించారు. ఒక వ్యక్తి కారు డ్రైవ్ చేస్తుండగా వెనుక సీటులో ఉన్న బాలికపై ఆమె ఫ్రెండ్ లైంగిక దాడికి పాల్పడ్డాడు.




డ్రైవర్ పక్క సీటులో కూర్చొన్న మరో వ్యక్తి మొబైల్‌లో దీనిని రికార్డ్ చేశాడు. అనంతరం నిందితుడు వీడియో చూపించి ఆ బాలికను బ్లాక్‌మెయిల్ చేశాడు. ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడు. ఆమె మాట వినకపోవడంతో ఆ వీడియో క్లిప్‌ను సోషల్ మీడియాలో వైరల్ చేశారు. మరోవైపు ఇది తెలుసుకున్న బాధిత బాలిక జరిగిన సంఘటనను తన కుటుంబానికి చెప్పింది. కుటుంబ సభ్యులతో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. దీంతో పోక్సో చట్టంతో పాటు పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను పట్టుకునేందుకు బృందాలను ఏర్పాటు చేశారు. బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తితో పాటు అతడి స్నేహితుడ్ని అరెస్ట్ చేశారు. కారును కూడా స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం పోలీసులు వెతుకుతున్నారు. నిందితులంతా 18 నుంచి 20 ఏళ్ల యువకులని పోలీస్ అధికారి వెల్లడించారు.

# నీట్‌లో అప్పుడెమో 720కి 720 మార్కులు

- ఇప్పుడెమో అత్యధిక స్కోరే 682 మార్కులు
- తొలుత ఫలితాలకు ఇప్పటికి భారీ వ్యత్యాసం

ముందడుగు జాతీయం:
నీట్ యూజీ 2024 పరీక్షలో అక్రమాలు కారణంగా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇటీవల మళ్లీ పరీక్ష నిర్వహించారు. సుప్రీం విచారణలో భాగంగా నగరాలు, పరీక్ష కేంద్రాల వారీగా నీట్-యూజీ ఫలితాలను జాతీయ పరీక్షల సంస్థ (ఎన్టీఏ) శనివారం వెల్లడించింది. జూన్ 4న వెలువడిన నీట్ ఫలితాల్లో దేశవ్యాప్తంగా 67 మందికి ఫస్ట్ ర్యాంక్ వచ్చింది. అందులో ఒకే కేంద్రంలో పరీక్ష రాసిన ఆరుగురికి 720కి 720 మార్కులు వచ్చాయి. ఆ ఫలితాలపై తీవ్ర అనుమానాలు వ్యక్తమయ్యాయి. 1563 మందికి గ్రేస్ మార్కులు కలపడం ఆ పరిస్థితికి దారితీసిందని గుర్తించిన సుప్రీం.. వారికి మళ్లీ పరీక్ష నిర్వహించాలని ఆదేశించింది. వారిలో 813 మంది మాత్రమే హాజరయ్యారు. ఫలితాల అనంతరం సదరు కేంద్రంలో వచ్చిన అత్యధిక స్కోరు 682గా ఉండటం గమనార్హం. అది కూడా ఒక్క విద్యార్థికే వచ్చింది. 13 మంది విద్యార్థులకు 600 పైగా మార్కులు వచ్చాయి. తొలుత వెల్లడైన ఫలితాలకు వీటికి మధ్య భారీ వ్యత్యాసం కనిపించింది. రీటెస్ట్ తర్వాత



నీట్ యూజీ పరీక్ష రాసిన అందరి ర్యాంకులు మారినట్లు ఫలితాల తర్వాత ఎన్‌టీఏ వెల్లడించింది. నీట్ పరీక్షలో పేపర్ లీక్ జరిగిన ఆరోపణలపై దర్యాప్తు జరుగుతోంది. మరోపక్క ఈ అవకతవకలపై సుప్రీంలో విచారణ జరుగుతోంది. ఈ క్రమంలోనే విచారణలో భాగంగా మిగతా కేంద్రాలతో పోలిస్తే అనుమానిత పరీక్ష కేంద్రాల్లో రాసిన వారికి ఎక్కువ మార్కులు వచ్చాయా.. లేదా అని తెలుసుకోవడానికి కేంద్రాల వారీగా ఫలితాలు అందించాలని కోర్టు ఎన్టీఏను ఆదేశించింది. ఫలితాలను ఎన్టీఏ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని, అయితే విద్యార్థుల గుర్తింపు బయటపడకుండా చూడాలని సూచించింది.

ముందడుగు
ఆదివారం,
21-7-2024,
హైదరాబాద్

# భారత్‌లో 11లక్షల కొవిడ్ అధిక మరణాలు

- అధ్యయనంపై కేంద్ర ఆరోగ్యశాఖ ఆగ్రహం
- తప్పుదోవ పట్టించే నివేదిక అని ఆరోపణ




ముందడుగు జాతీయం: కరోనా కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది మరణించారు. భారత్‌లోనూ కరోనాతో 5.3లక్షల మంది మృతిచెందారు. కొవిడ్ సమయంలో భారత్‌లో మరణాల సంఖ్య నివేదించిన దాని కన్నా చాలా ఎక్కువగా ఉన్నట్లు ఓ అంతర్జాతీయ అధ్యయం తాజాగా వెల్లడించింది. 2020లో 11.9 లక్షల అధిక మరణాలు చోటుచేసుకున్నట్లు పేర్కొంది. ఈ అధ్యయనాన్ని కేంద్ర ఆరోగ్యశాఖ తీవ్రంగా ఖండించింది. ఇది తప్పుదోవ పట్టించే నివేదిక అని కొట్టిపారేసింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ సహా పలు విశ్వవిద్యాలయాలకు చెందిన పరిశోధకులు ఈ అధ్యయనం నిర్వహించారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 నివేదికను విశ్లేషించి భారత్‌లో కరోనా విజృంభణ సమయంలో అత్యధిక మరణాలు చోటుచేసుకున్నట్లు నివేదికలో పేర్కొన్నారు. కొన్ని మీడియా కథనాలు ఈ అధ్యయనాన్ని ప్రచురించడంతో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ దీన్ని ఖండిస్తూ ఓ ప్రకటన విడుదల చేసింది.

ఆ అధ్యయనం చేసిన అంచనాలు తప్పుదోవ పట్టించేవిగా ఉన్నాయి. లోపభూయిష్టమైన పద్ధతిలో వారు చేసిన అధ్యయనం ఆమోదయోగ్యం కాదు. ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ నుంచి సేకరించిన సమాచారాన్ని మొత్తం దేశానికి ఆపాదించలేం. దేశంలోని సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ అత్యంత విశ్వసనీయమైనది. దేశంలో 99 శాతం మరణాలు ఇందులో రికార్డ్ అవుతాయి. దీని ప్రకారం 2019తో పోలిస్తే 2020లో మరణాలు 4.74లక్షలు పెరిగాయి. అంతకుముందు రెండు సంవత్సరాల్లోనూ (2018లో 4.86లక్షలు, 2019లో 6.90లక్షల పెరుగుదల) మరణాల్లో ఇలాంటి అత్యధిక పెరుగుదల నమోదైంది. అధికంగా నమోదైన మరణాలన్నింటికీ కొవిడ్ మహమ్మారి కారణమని చెప్పలేం. ఇతరత్రా ఆరోగ్య సమస్యలూ ఉంటాయి'' అని ఆరోగ్యశాఖ స్పష్టం చేసింది.

# తెలంగాణలో ముులుగు జిల్లాలో అత్యధిక వర్షపాతం

## వెంకటాపురంలో 109 మి.మీ. నమోదు

ముందడుగు తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షా లు కురుస్తున్నాయి. కుండపోత వానలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ప్రాజెక్టులు నిండు కుండలా మారాయి. నిన్న రాత్రి నుంచి వర్షం కురుస్తోనే ఉంది. అయితే ఈ వారాంతంలో తెలంగాణ రికార్డు వర్షపాతాన్ని నమోదు చేసింది. శనివారం రేపు భారీ వర్షా లు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. భారీ వర్షా ల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. పలు ప్రాంతాల్లో రోడ్లపై వరద నీరు ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోయింది. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ నివేదిక ప్రకారం.. ములుగు జిల్లాలోని వెంకటాపురంలో అత్యధికంగా 109 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చర్లలో 96.8 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఖమ్మం, మహబూబ్‌నగర్, మహబూబాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, కరీంనగర్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో 40 నుంచి 80 మి.మీ. వర్షపాతం నమోదైంది. వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షా లు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ప్రధానంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అతి భారీ వర్షా లు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీనంగర్, భూపాలపల్లి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. రాబోయే 18 గంటల్లో అతి భారీ వర్షా లు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# తెలంగాణలో మారిన పాఠశాలల పనివేళలు

## తెలంగాణ విద్యాశాక కీలక నిర్ణయం

ముందడుగు తెలంగాణ: తెలంగాణ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పని వేళలకు సంబంధించి తెలంగాణ విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త విద్యాశాఖ పనివేళల మార్పు గురించి ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు పని చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఉన్నత పాఠశాలలు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు పని చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్కూల్స్ యథావిధిగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు కొనసాగుతాయని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు. ఇక హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో కూడా యథావిధిగా ఉదయం 8.45 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పాఠశాలల నిర్వహణ కొనసాగనున్నట్లు స్పష్టం చేశారు.

# అందంగా ఉన్నావు.. చెప్పిన ప్లేసుకు రా

## బాధిత మహిళకు సిఐ మెసేజులు ▪ ఆగ్రహం వ్యక్తం చేసిన హైదరాబాద్ సీపీ

ముందడుగు హైదరాబాద్: ఒక మహిళ తన సమస్య గురించి ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వచ్చింది. మహిళ సమస్య విన్నాక ఆమె నంబర్ తీసుకున్న.. అక్కడి ఇన్‌స్పెక్టర్ ఆమెకు అసభ్య మెసేజ్‌లు చేశాడు. దీంతో బాధితురాలు.. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో సదరు ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేశారు. సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పురేందర్ రెడ్డి... ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన మహిళతో ఇన్‌స్పెక్టర్ అసభ్య చాటింగ్ చేశాడు. బాధితురాలు ఇది తప్పని వారించి.. సీఐ బాగోతాన్ని సిటీ కమిషనర్‌కు చెప్పి కన్నీళ్లు పెట్టుకుంది. అందంగా ఉన్నావు.. చెప్పిన ప్లేసుకు రా అంటూ అతడు పెట్టిన అసభ్య




మెసెజ్‌ల తాలూకా ఆధారాలను కూడా అందజేసింది. సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ ప్రవర్తనపై సీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అతడిని హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ సైబరాబాద్ సీపీ ఉత్తర్వులు ఇచ్చారు. పోలీసు అధికారులు, సిబ్బంది.. స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల గౌరవంగా మెలగాలని.. తప్పుగా వ్యవహరిస్తే.. వేటు పడుతుందని ఈ సందర్భంగా సీపీ హెచ్చరించారు. పోలీస్ శాఖకు గౌరవానికి భంగం కలిగించేలా ఎవరూ వ్యవహరించినా.. చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ముందడుగు
ఆదివారం,
21-7-2024,
హైదరాబాద్

# బంగ్లాదేశ్‌లో తీవ్ర ఉద్రిక్తతలు

- ఘర్షణల్లో 100 మందికి పైగా మృతి
- స్వదేశానికి వచ్చిన భారత విద్యార్థులు



ముందడుగు జాతీయం:
బంగ్లాదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల విధానాన్ని సంస్కరించాలంటూ విద్యార్థులు చేస్తోన్న ఆందోళనలు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. ఈ నేపథ్యంలో అక్కడ చదువుకుంటున్న పలువురు భారత విద్యార్థులు సురక్షితంగా స్వదేశానికి చేరుకుంటున్నారు. ఇప్పటివరకు సుమారు 1000 మంది విద్యార్థులు వచ్చారు. వారిలో 778 మంది సరిహద్దు మార్గాల ద్వారా రాగా, మరో 200 మంది విమానాల్లో సొంత దేశానికి చేరుకున్నారు. ఈ విషయాన్ని భారత విదేశాంగ శాఖ అధికారిక ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఎక్స్(ట్విటర్) వేదికగా వెల్లడించారు. అంతర్జాతీయ సరిహద్దు ద్వారా బంగ్లాదేశ్ నుంచి భారత్ చేరుకుంటున్న విద్యార్థుల సురక్షిత ప్రయాణానికి ఢాకాలోని భారత హై కమిషన్ అన్ని సదుపాయాలు కల్పిస్తోందని విదేశాంగ శాఖ తెలిపింది.

ఈ నిమిత్తం పౌర విమానయాన శాఖ, సరిహద్దు భద్రతా దళంతో సంప్రదింపులు జరుపుతోందని వెల్లడించింది. ఇప్పటికే దాదాపు 1000 మంది విద్యార్థులు స్వదేశానికి రాగా.. ఇంకా వివిధ విశ్వవిద్యాలయాల్లో ఉన్న 4వేల మంది విద్యార్థులతో హై కమిషన్ కాంటాక్ట్‌లో ఉంది. ఆందోళనకారులు, పోలీసులకు మధ్య జరుగుతున్న ఘర్షణల్లో ఇప్పటివరకు 100 మందికి పైగా మృతిచెందినట్లు పలు మీడియా కథనాలు వెల్లడించాయి.

# ఆధార్ కార్డు ఉంటే పది నిమిషాల్లో పాన్..

వెంటనే మెయిల్‌కు వస్తున్న ఈపాన్ ▪ దరఖాస్తు చేసే విధానం కూడా ఈజీనే

ముందడుగు ప్రత్యేకం:
బ్యాంకింగ్ వ్యవస్థ వినియోగదారులకు పాన్‌కార్డు అనేది తప్పనిసరి చేసింది. బ్యాంకులో అకౌంట్ ఉన్న ప్రతి ఒక్కరూ పాన్‌కార్డు తీసుకోవాలని ప్రభుత్వం తప్పనసరి చేసింది. ఆదాయ వ్యయాలను ట్రాక్ చేయడానికి పాన్ కార్డు ఎంతగానో ఉపయోగపడుతుంది. బ్యాంకు ఖాతా తెరవాలన్నా, రూ.50 వేల మించి డిపాజిట్ చేయాలన్నా పాన్ కార్డు తప్పనిసరి. అయితే పాన్ కార్డు పొందాలంటే ఓ పది రోజుల పడుతుందని అందరూ చెబుతారు. కానీ పెరిగిన టెక్నాలజీ కారణంగా కేవలం పది నిమిషాల్లోనే పాన్ కార్డు పొందవచ్చని తెలుసా? మీరు వింటున్నది నిజమే. ఆధార్ కార్డు ఉంటే కేవలం పది నిమిషాల్లోనే పాన్ కార్డు పొందవచ్చు. ఈ-పాన్ కింద పిలిచే ఈ కార్డును ఎలా పొందాలో? ఓసారి తెలుసుకుందాం.




## ఈ-పాన్ డౌన్‌లోడ్ ఇలా

ఈ-పాన్ సదుపాయం అనేది చెల్లుబాటు అయ్యే ఆధార్ నంబర్‌ను కలిగి ఉన్న దరఖాస్తుదారుల కోసం కేటాయిస్తారు. అయితే పాన్ కార్డు అనేది పీడీఎఫ్ ఫార్మాట్‌లో జారీ అవుతుంది. అలాగే ఈ సేవలను పూర్తి ఉచితంగా పొందవచ్చు. ఈ-పాన్ అంటే ఆధార్‌కు సంబంధించిన ఈ-కేవైసీ డేటా ఆధారంగా ఎలక్ట్రానిక్ ఫార్మాట్‌లో జారీ చేసే డిజిటల్ సైన్ పాన్ కార్డ్ అని అర్థం. ఈ ప్రక్రియ చాలా సులభంగా ఉండడమే కాకుండా డాక్యుమెంట్ ఫ్రీ సర్వీస్‌గా పొందవచ్చు. ఈ సర్వీస్‌ను పొందాలంటే మీ ఆధార్‌కు కచ్చితంగా ఫోన్ నెంబర్ లింక్ అయ్యి ఉండాలి. ఈ-పాన్‌లు చట్టబద్ధంగా చెల్లుబాటు అయ్యేవి. అలాగే ఆదాయపు పన్ను రిటర్న్‌లను దాఖలు చేయడం, ఆర్థిక లావాదేవీలను నిర్వహించడంతో పాటు కేవైసీ అవసరాలకు కూడా ఆమోదం ఉంటుంది. ఈ-పాన్ అనేది వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులందరికీ అందుబాటులో ఉంటుంది.

## ఈ-పాన్ పొందే విధానం


ఆదాయపు పన్ను శాఖకు సంబంధించిన ఈ-ఫైలింగ్ పోర్టల్‌ని సందర్శించాలి. ఈ-ఫైలింగ్ పోర్టల్ హోమ్‌పేజీకి వెళ్లి తక్షణ ఇ-పాన్ క్లిక్ చేయాలి. ఈ-పాన్ పేజీలో కొత్త ఈ-పాన్ పొందు క్లిక్ చేయాలి. గెట్ న్యూ ఈ-పాన్ పేజీలో మీ 12-అంకెల ఆధార్ నంబర్‌ను నమోదు చేసి, ఐ ఎగ్రీ అనే చెక్‌బాక్స్‌ని ఎంచుకుని, కొనసాగించుపై క్లిక్ చేయాలి. ఓటీపీ ధ్రువీకరణ పేజీలో చెక్ బ్యాక్స్ క్లిక్ చేసి ప్రోసీడ్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. ఓటీపీ ధ్రువీకరణ పేజీలో ఆధార్‌తో లింక్ చేయబడిన మొబైల్ నంబర్‌లో అందుకున్న 6 అంకెల ఓటీపీ నమోదు చేయాలి. యూఐడీఏఐ ఆధార్ వివరాలను ధ్రువీకరించడానికి చెక్‌బాక్స్‌ని ఎంచుకుని ప్రోసీడ్‌పై క్లిక్ చేయాలి. ఆధార్ వివరాల ధ్రువీకరణ పేజీలో ఐ యాక్సెప్ట్ చెక్‌బాక్స్‌ని ఎంచుకుని ప్రోసీడ్‌పై క్లిక్ చేస్తే పది నిమిషాల్లో మీ పాన్ కార్డును మెయిల్ ద్వారా వస్తుంది.

# వీధి కుక్కల కోసం ఐఏఎస్ అధికారుల కమిటీ

- రాష్ట్రవ్యాప్తంగా పెరుగుతున్న కుక్కల దాడులు
- సీరియస్‌గా తీసుకున్న మధ్యప్రదేశ్ ప్రభుత్వం

ముందడుగు మధ్యప్రదేశ్:
రాష్ట్రవ్యాప్తంగా పెరుగుతున్న వీధికుక్కల దాడులపై మధ్యప్రదేశ్ ప్రభుత్వం సీరియస్‌గా దృష్టిసారించింది. వీధుల్లో, నివాస ప్రాంతాల్లో, చివరకు పాఠశాలల్లో కూడా కుక్కల బెడద తీవ్రం కావడం రాష్ట్రంలో ఆందోళనకరంగా మారింది. దీంతో అడిషనల్ చీఫ్ సెక్రటరీ స్థాయి వరకు ఐఏఎస్ అధికారులతో సహా 15 మందితో కమిటీని ఏర్పాటు చేస్తూ ఆ రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఏటా 21,000 కుక్క కాటు కేసులు నమోదు అవుతున్నాయి. గత ఐదేళ్లలో వీధికుక్కల కాటు వల్ల రేబిస్ సోకడంతో ఐదుగురు మరణించారు. రాజధాని భోపాల్‌లోని ఆస్పత్రిలోనే రోజుకు సగటున 55 కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి. క్షేత్రస్థాయిలో పరిస్థితి



దారుణంగా ఉంది. భోపాల్ మున్సిపల్ కార్పొరేషన్ షెల్టర్ హోమ్‌లో వీధి కుక్కలు కిక్కిరిసి పోయాయి. రేబిస్ ఇంజెక్షన్ కోసం ప్రతీరోజూ డజన్ల కొద్దీ ప్రజలు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. హాస్పిటల్ డేటా ప్రకారం.. 2022లో 8,124 కుక్కకాటు సంఘటనలు నమోదయ్యాయి. 2023లో ఈ సంఖ్య దాదాపు రెండింతలు పెరిగి 16,387కి చేరుకుంది. 2024 మొదటి ఐదు నెలల్లో కుక్కకాటుకు సంబంధించి 7,728 కేసులు నమోదయ్యాయి.

# ప్రతి కంపెనీకి ప్రధాన మూలం హెచ్‌ఆర్ రంగం

## ఐకాన్ ఆధ్వర్యంలో "ఐ లవ్ హెచ్‌ఆర్ అవార్డ్స్ కాన్క్లేవ్ & ఎక్స్‌పో"

ముందడుగు హైదరాబాద్ :
హెచ్‌ఆర్ రంగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వ్యక్తులకు ఐకాన్ (ఇంటర్నేషనల్ నాలెడ్జ్ అండ్ ఆపర్చునిటీస్ నెట్‌వర్క్) నిర్వహించిన "ఐ లవ్ హెచ్‌ఆర్ అవార్డ్స్ కాన్క్లేవ్ & ఎక్స్‌పోలో ప్రతిష్టాత్మక అవార్డులు అందజేశారు. శనివారం హైటెక్ సిటీలోని ఇస్తా కన్వెన్షన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో క్రిష్ చింతలూరి అధ్యక్షత వహించగా మానవ వనరుల రంగంలో ప్రతిభగల వారికి తెలంగాణ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ ఘనంగా సత్కరించారు. వేదికపై అతనితో పాటు విశిష్ట అతిథుల బృందం ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జె.ఎ. చౌదరి, బిజెపి జాతీయ నాయకుడు కరుణ గోపాల్, నలంద విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొ. సునైనా సింగ్, అసోచామ్




కర్ణాటక చైర్మన్ డాక్టర్ మీరా వెంకట్, యుఈటి సిఈఓ ప్రసాద్ మావుడూరి, కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా సెక్రటరీ చంద్ర శేఖర్ దాసక, గ్లోబల్ హెడ్ పీపుల్ ఆపరేషన్స్ అరవింద్ మాథుర్, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ఛాన్సలర్ కె. సత్యనారాయణ రాజు, అన్నమాచార్య విశ్వవిద్యాలయం ఛాన్సలర్ అభిషేక్ రెడ్డి, సీఈఓ వెంకట్ బూరా, సిఎండీ క్వాలిటీ థాట్ రమణ భూపతి హజరయ్యారు. జయేష్ రంజన్ మాట్లాడుతూ ప్రతి కంపెనీకి ప్రధాన మూలం హెచ్‌ఆర్ వ్యవస్థ అని, నిరంతరం వారు పని ఒత్తిడితో బిజీ జీవితం గడుపుతారు. ఇలాంటి అవార్డుల కార్యక్రమాలు వారిలో మరింత ఉత్సాహాన్ని నింపే అవకాశం ఉంటుంది. ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం చేపట్టాలని, వారిలో ఉన్నతికి సహకరించినప్పుడే ఏ కంపెనీ ఐనా మరింత ముందుకు పోతుందన్నారు.

ముందడుగు
ఆదివారం, 21-7-2024, హైదరాబాద్

# వర్షాలతో మీ కార్లు జాగ్రత్త

## కారులో ఈ 8 భాగాలు దెబ్బతింటాయి ■ డ్యామేజ్ కాకుండా ఈ టిప్స్ పాటించండి

ముందడుగు ప్రత్యేకం: దేశవ్యాప్తంగా విపరీతంగా ఎడతెరిపి లేని వర్షా లు మొదలయ్యాయి. చాలా ప్రాంతాల్లో వరదలు ఏరులై పారుతున్నాయి. ముఖ్యంగా కారు ఓనర్లు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. భారీ వర్షా లు, జలమయమైన రోడ్లలో ప్రయాణాలతో కారులోని 8 భాగాలు బాగా దెబ్బతింటాయి. వాటిని రిపేర్ చేయించుకోవడం ఆర్థిక భారంగా మారుతుంది. ఆన్‌లైన్ యూజ్డ్ కార్ మార్కెట్‌ప్లేస్ అయిన కార్స్24కు చెందిన ఒక ఎక్స్‌పర్ట్ వానా కాలంలో కారు పార్ట్స్ డ్యామేజ్ కాకుండా ఉండడానికి పాటించాల్సిన కొన్ని టిప్స్ పంచుకున్నారు.



### టైర్లు

ఈ కాలంలో టైర్ల రబ్బర్ దెబ్బతింటుంది. వరదలకు కూడా పాడైపోతాయి. ఫలితంగా టైర్ల గ్రిప్ తగ్గుతుంది. అందుకే టైర్లు మంచిగా ఉన్నాయో లేదో చెక్ చేస్తూ ఉండాలి. అరిగిపోతే మార్చుకోవడం మంచిది. తక్కువ గాలి ఉన్న టైర్లు వర్షా కాలంలో మరింత ప్రమాదకరంగా ఉంటాయి, ఎందుకంటే అవి సులభంగా స్కిడ్ అవుతాయి. కాబట్టి ఎయిర్ ప్రెషర్ సరిగ్గా ఉండేలా చూసుకోవాలి.

### వైపర్లు, విండ్‌షీల్డ్

భారీ వర్షా లు, ధూళి, చెత్తతో కూడిన వర్షా కాలం వైపర్లు, విండ్‌షీల్డ్‌కు చాలా హాని చేస్తుంది. వైపర్లను ఎక్కువగా వాడటం వల్ల అవి త్వరగా అరిగిపోతాయి. దీనివల్ల చారలు ఏర్పడి విండ్‌షీల్డ్ ద్వారా స్పష్టంగా చూడలేం. విండ్‌షీల్డ్‌పై నీరు పడటం వల్ల పగుళ్లు ఏర్పడే అవకాశం ఉంది. దాన్ని రక్షించుకోవడానికి వైపర్ బ్లేడ్స్‌ను మంచి కండిషన్‌లో ఉంచాలి. అవసరమైనప్పుడు వాటిని మార్చాలి. క్వాలిటీ క్లీనర్లు, రెయిన్ రెపలెంట్స్ ఉపయోగించాలి. వాషర్ ఫ్లూయిడ్ రిజర్వాయర్ నిండినట్లు చూసుకోవాలి. స్ప్రే నాజిల్లు సరిగ్గా పనిచేస్తున్నాయని నిర్ధారించుకోవాలి.

### పెయింట్

వర్షా లు, బురద, కాలుష్యాలు వల్ల కారు పెయింట్ కలర్ పోతుంది. మరకలు ఏర్పడతాయి. ఎసిడిక్ రెయిన్స్ కారణంగా పెయింట్ త్వరగా వీక్ అయిపోతుంది. కారును తరచుగా కడగాలి. వ్యాక్స్ చేయాలి. ఎక్స్‌ట్రా ప్రొటెక్షన్ కోసం హై-క్వాలిటీ పెయింట్ సీలెంట్‌ను ఉపయోగించాలి.

### బ్రేక్స్

వర్షా లు బ్రేక్ ప్యాడ్స్, డిస్క్స్‌పై మరింత తుప్పు పడతాయి. దీనివల్ల బ్రేక్‌ల పనితీరు తగ్గుతుంది. తడి రోడ్లు బ్రేక్ డైస్టెన్స్‌ను పెంచుతాయి, అప్పుడు డ్రైవింగ్ మరింత ప్రమాదకరంగా మారుతుంది. అందుకే వర్షా కాలం ముందు, తర్వాత, క్రమం తప్పకుండా బ్రేక్స్‌ను చెక్ చేసుకోవాలి. నీటిలో డ్రైవ్ చేసిన తర్వాత, బ్రేక్స్‌పై తట్టాలి, అప్పడే తద్వారా అవి ఆరిపోతాయి. పెద్దగా నష్టం వాటిల్లదు.

### ఇంజన్

ఈ కాలంలో నీరు ఇంజన్‌లోకి ప్రవేశించవచ్చు. సిలిండర్లలో వాటర్ నిండి పిస్టన్ కదలికకు అడ్డంకిగా మారవచ్చు. ఇది ఇంజన్‌కు తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తుంది. లోతైన నీటిలో డ్రైవింగ్ చేస్తే మరింత నష్టం జరుగవచ్చు. అందుకే నీరు పొంగిపొర్లుతున్న ప్రాంతాల్లో డ్రైవ్ చేయకపోవడమే మంచిది. ఒకవేళ తప్పదు అనుకుంటే స్లోగా డ్రైవ్ చేయడం మంచిది.

### కారు అడుగు భాగం

కారు అడుగు భాగంలో ఎగ్జాస్ట్ సిస్టమ్, ఫ్యూయల్ లైన్లు, సస్పెన్షన్ వంటి భాగాలు ఉంటాయి. చెత్త, బురద కారణంగా ఇవి తుప్పు పట్టి బలహీనపడతాయి. అందుకే యాంటీ-రస్ట్ ట్రీట్‌మెంట్‌ను వాడాలి. క్రమం తప్పకుండా కారు అడుగు భాగాన్ని శుభ్రం చేయాలి.

### ఎలక్ట్రికల్ సిస్టమ్స్

వానాకాలంలో కారు ఎలక్ట్రికల్ సిస్టమ్స్ దెబ్బతింటాయి, షార్ట్ సర్క్యూట్స్, లైట్లు, సెన్సార్లు, ఇతర సిస్టమ్స్‌లో సమస్యలు ఏర్పడతాయి. ఈ సమస్యలతో పాటు తుప్పకు పరిష్కారంగా కనెక్టర్లపై డైఎలక్ట్రిక్ గ్రీజును ఉపయోగించాలి. అన్ని విద్యుత్ కనెక్షన్లు ఇన్సులేట్ అయ్యేలా, గట్టిగా ఉండేలా చూసుకోవాలి. బ్యాటరీ టెర్మినల్స్, వైరింగ్, ఫ్యూజ్ బాక్స్ ఆక్సిడేషన్ వంటివి డైలీ చెక్ చేసుకోవాలి. వానకు తడవని చోట కారు పార్క్ చేయాలి.

### కారు బ్యాటరీ

అధిక తేమకు బ్యాటరీలు త్వరగా డిశ్చార్జ్ అవుతాయి, టెర్మినల్స్‌కు తుప్పు పట్టవచ్చు. తుప్పు స్టార్టింగ్ సమస్యలు, బ్యాటరీ సామర్థ్యం తగ్గడానికి దారితీస్తుంది. నీరు బ్యాటరీ కేసింగ్‌ను కూడా దెబ్బతీస్తుంది. అందుకే బ్యాటరీ టెర్మినల్స్‌ను శుభ్రంగా, తుప్పు పట్టకుండా ఉంచాలి. వాటిని శుభ్రం చేయడానికి బేకింగ్ సోడా సొల్యూషన్ ఉపయోగించాలి. పెట్రోలియం జెల్లీని కూడా వాడవచ్చు. బ్యాటరీ వోల్టేజ్, స్టేటస్ క్రమం తప్పకుండా చెక్ చేయాలి.





## వాహన కొనుగోలుకు దాతలు సహకరించగలరు

ముందడుగు హన్మకొండ: గ్రేటర్ వరంగల్, హన్మకొండ, ఖాజీపేట మరియు పరిసర ప్రాంతాలలో వివిధ ఫంక్షన్లలో మిగిలిపోయిన ఆహారం వృధా కాకుండా దానిని సేకరించి నగర పరిధిలో అనాథలు, వృద్ధాశ్రమాలకు మరియు ఆకలితో ఉన్నవారికి అందించి వారి కడుపు నింపడానికి గాను ఆహారాన్ని తరలించడానికి ఒమిని వాహనం కొనుగోలుకు లక్షా అరవై వేల రూపాయలు అవసరమైనవి. కావున ఎవరైనా మంచి మనసున్న దాతలు ఆర్థిక సహాయం అందించాలని "అడ్వాన్స్డ్ లైఫ్ ఫౌండేషన్" వ్యవస్థాపకుడు నార్లాపురం రాజు దాతలను కోరారు. నగర పరిధిలో గత మూడు సంవత్సరాలుగా ఆకలితో ఉన్నవారికి మాకు వీలైనంత వరకు ఆహారాన్ని అందిస్తున్నామని ఇందుకు వాహన సౌకర్యం లేక చాలా ఇబ్బందిగా ఉంటుందని , కావున ఒమిని వాహన కొనుగోలుకు ఇప్పటివరకు రూపాయలు 97 వేయిలు జమ అయినవి ఇంకా 63 వేయిల రూపాయలు అవసరమైనవి దాతలు ఎవరైనా 9000544402 నంబరుకు గూగుల్ పే , ఫోన్ పే , పేటిఎం ద్వారా లేదా అకౌంట్ నంబర్. 01878800000130 , IFSC కోడ్ YESB0000187 కు పంపగలరని రాజు కోరారు.